# ఖమ్మాన్ని అగ్రభాగాన నిలబెడతా..

- మరో అవకాశమిస్తే పెద్ద నగరాల మాదిరిగా తీర్చిదిద్దుతా
- ఇప్పటికే సాంకేతికతను జోడించి చెత్త సేకరణ చేస్తున్నాం..
- ఖమ్మం డివిజన్ల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్


శ్రీచైతన్య ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, నవంబర్ 24: నియోజకవర్గ ప్రజలు మరో అవకాశమిస్తే ఖమ్మాన్ని పెద్ద నగరాల మాదిరిగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఖమ్మం రూపురేఖలను మరింతగా తీర్చిదిద్ది అగ్రభాగాన నిలుపుతానని మాట ఇచ్చారు. ఖమ్మం నగరంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. 49వ డివిజన్‌తో పాటు మరికొన్ని డివిజన్లలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఇంకొన్ని డివిజన్లలో రోడ్‌షోలు నిర్వహించారు. మరికొన్ని ప్రాంతాల్లో పలు సంఘాలు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాలకు హాజరయ్యారు. తొలుత ఖమ్మం 49వ డివిజన్ మామిళ్లగూడెంలో జరిగిన ప్రచారంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి నమూనా బ్యాలెట్‌ను చూపిస్తూ ప్రచారం చేశారు. మొదటి బ్యాలెట్‌లోని మొదటి సంఖ్యలో ఉన్న కారు గుర్తుపై ఓటు వేసి తనకు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మాన్ని ఇప్పటికే ప్రశాంత నగరంగా, పర్యాటక నగరంగా తీర్చిదిద్దానని గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో కూడా తనను అధిక మెజార్టీతో తనకు విజయాన్ని అందిస్తే ఖమ్మం శోభ మరింత విరాజిల్లేలా అభివృద్ధి చేస్తానని అన్నారు. పదేళ్ల క్రితం ఖమ్మం మున్సిపాలిటీ చెత్త సేకరణ అస్తవ్యస్తంగా ఉండేదని, కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక తాను ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా అయ్యాక కొత్త విధానాలు తీసుకొచ్చానని అన్నారు. సాంకేతికతను జోడించి చెత్తను సేకరిస్తుండడంతో డివిజన్ల ప్రజలు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. తాను ప్రచారానికి వెళ్లి ప్రతిచోటా ఇదే విషయాన్ని తనకు గుర్తుచేస్తున్నారని వివరించారు. అందుకని ఇక్కడి నుంచి తనను మరోసారి గెలిపించాలని, కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు మన్నే వెంకటరమణ, మేడి పవన్‌కుమార్, పొన్నం వెంకటేశ్వర్లు, ఊటుకూరి రవికాంత్, మన్నే శేషారత్నం, నల్లమోతు కోటేశ్వరరావు, శాబాసు శ్రీనివాస్‌రావు, పర్సా రంగారావు, గుండా కోటేశ్వరరావు, కే.రంగాచారి, వేముల సుధీర్, జమలాపురం కేశవరావు, కిషన్‌రావు, జి.వేణుగోపాల్, ఏ.శ్రీనివాస్, నజీర్, పొన్నం వినేశ్, బాషా, దాక్షయిని, గోళ్ల రాధాకృష్ణ, షకీనా తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు

- 60 ఏళ్లలో కాంగ్రెస్ చేయలేని అభివృద్ధిని పదేళ్లలో కేసీఆర్ చేశారు
- బీఆర్ఎస్ గెలిస్తే 'పినపాక'లో ప్రతి ఎస్సీ కుటుంబానికీ దళితబంధు
- బూర్గంపహాడ్ ప్రచారంలో ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ అభ్యర్థి రేగా


సారపాకలో ఐటీసీ కార్మికులను ఓటు అభ్యర్థిస్తున్న ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ అభ్యర్థి రేగా

బూర్గంపహాడ్/ సారపాక, నవంబర్ 24: సీఎం కేసీఆర్ పాలనలో సుభిక్షంగా ఉన్న తెలంగాణను చూసి కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ పినపాక నియోజకవర్గ అభ్యర్థి రేగా కాంతారావు విమర్శించారు. అందుకే ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తోందని అన్నారు. ప్రజలందరూ వాటిని గమనించాలని, కాంగ్రెస్ నేతల మాయమాటలను నమ్మవద్దని సూచించారు. బూర్గంపహాడ్ మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. తొలుత సారపాకలోని ఐటీసీ కార్మికులకు కలిసి కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. అనంతరం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, బూర్గంపహాడ్, మోరంపల్లిబంజర్, పినపాక పట్టీనగర్, లక్ష్మీపురం గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించి విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతోనే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం గిరిజనులందరికీ సీఎం కేసీఆర్ పోడు భూములకు పట్టాలు ఇచ్చారని, వాటితో పాటు రైతుబంధు, రైతుబీమా అమలుచేస్తున్నారని గుర్తుచేశారు. ఏజెన్సీ ప్రాంతమైన పినపాక నియోజకవర్గంలో దళితులు వెనుకబడి ఉన్నారని తాను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారని, నియోజకవర్గమంతా దళితబంధును అమలుచేస్తామని ఇటీవల లక్ష్మీపురం సభలో ప్రకటించారని వివరించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రతి ఎస్సీ కుటుంబానికీ దళితబంధు పథకం వర్తిస్తుందని అన్నారు. అన్నింటికీ మించి 60 ఏళ్లలో కాంగ్రెస్ చేయలేని అభివృద్ధిని పదేళ్లలో సీఎం కేసీఆర్ చేసి చూపించారని అన్నారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కామిరెడ్డి శ్రీలత, పొడియం ముత్యాలమ్మ, బిక్కసాని శ్రీనివాసరావు, గోపిరెడ్డి రమణారెడ్డి, జలగం జగదీశ్, వల్లూరిపల్లి వంశీకృష్ణ, తోటమళ్ల భిక్షం, సానికొమ్ము శంకర్‌రెడ్డి, బిజ్జం శ్రీనివాసరెడ్డి, కామిరెడ్డి రామకొండారెడ్డి, మేడం లక్ష్మీనారాయణరెడ్డి, కొనకంచి శ్రీను, ఎల్లంకి లలిత, తాతా మాధవీలత, గోనెల నాని, భూపెల్లి నర్సింహారావు, జక్కం సర్వేశ్వరరావు, ఎక్కంటి శ్రీనివాసరెడ్డి, చేతుల పెద్దవీర్రాజు, హుస్సేన్‌నాయక్, కైపు ఖగేందర్‌రెడ్డి, ఝాన్సీలక్ష్మి, సిరిపురం స్వప్న, భూక్యా శ్రావణి, భూక్యా భారతి తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో రవాణా సౌకర్యం మెరుగుపర్చాం

- అనేక ప్రాంతాల్లో వంతెనలు, రహదారులు నిర్మించాం
- భద్రాచలం నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరేస్తాం
- దుమ్ముగూడెం ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం


రోడ్‌షోకు వచ్చిన వెంకట్రావుకు తిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న మారాయిగూడెం మహిళలు

దుమ్ముగూడెం, నవంబర్ 24: పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం నియోజకవర్గంలో రవాణా సౌకర్యాలను మెరుగుపర్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. ఏజెన్సీ ఆదివాసీలకు రవాణా మార్గాన్ని సులభతరం చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాంతంలో అనేక రహదారులు నిర్మించిందని, వాగులపై వంతెనలు నిర్మించిందని అన్నారు. దుమ్ముగూడెం మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. రామచంద్రునిపేట, కొత్తపల్లి, మారాయిగూడెం, బొజ్జికుప్ప, పత్తిపాక, లచ్చిగూడెం, రేగుబల్లి, చెరుపల్లి గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత మారాయిగూడెంలో మహిళలు ఆయనకు తిలకం దిద్ది హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. అందుకని ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఇక్కడి ప్రజలు అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పోడు భూములకు పట్టాలు పొందిన గిరిజన, ఆదివాసీ రైతులందరూ బీఆర్ఎస్ వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. పోడు పట్టాలతోపాటు వారికి రైతుబంధు, రైతుబీమా అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరేస్తామని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు రేసు లక్ష్మి, తెల్లం సీతమ్మ, అన్నె సత్యనారాయణమూర్తి, కణితి రాముడు, కామేశ్, అపకా వీర్రాజు, వాసు రాజు, ముర్రం వీరభద్రం, దామెర్ల శ్రీనివాసరావు, జానీపాషా తదితరులు పాల్గొన్నారు.

# జీవో 76తో పేదలకు ఇళ్ల స్థలాలిచ్చాం

- ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరించి గూడు కల్పించాం
- పట్టణంలోని ప్రతి వీధిలోనూ సీసీ రోడ్లు నిర్మించాం
- కొత్తగూడెం ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి వనమా


ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఎడవల్లి కృష్ణ, చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 24: పట్టణ పేదలను అన్ని విధాలా ఆదుకున్నది కేసీఆర్ ప్రభుత్వమేనని కొత్తగూడెం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఇప్పటికే కొత్తగూడెం పట్టణంలోని ఇంటి యజమానులకు జీవో నెంబర్ 76ను తీసుకువచ్చి ఇళ్ల స్థలాలు ఇచ్చామని, ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పర్చుకొని జీవిస్తున్న వారికి వాటిని క్రమబద్ధీకరించామని, వాటిపై హక్కులు కల్పిస్తూ పట్టాలు అందించామని వివరించారు. బీఆర్ఎస్ నేత ఎడవల్లి కృష్ణతో కలిసి కొత్తగూడెం పట్టణంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. 14,15, 28, 29, 30, 31 వార్డుల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పరిపాలనలోనే పేద, మధ్య తరగతి ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని అన్నారు. వారి సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని అన్నారు. అందుకని ప్రజలందరూ మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పట్టణంలోని ప్రతి వీధిలోనూ సీసీ రోడ్లు నిర్మించామని, 24 గంటలూ కిన్నెరసాని నీటినిని సరఫరా చేస్తున్నామని అన్నారు. రైల్వే నిర్వాసితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించామని, త్వరలోనే వాటిల్లో గృహప్రవేశాలు చేయిస్తామని అన్నారు. బీఆర్ఎస్ నాయకుడు ఎడవల్లి కృష్ణ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపిస్తే ఆ పార్టీ ఎమ్మెల్యేగా వనమా ఇక్కడ మరింత అభివృద్ధి చేసి చూపిస్తారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కోనేరు సత్యనారయణ (చిన్ని),ఎడవల్లి కృష్ణ, కాపు సీతాలక్ష్మి, అఫ్జలున్నీషా బేగం, పల్లపు లక్ష్మణ్, నేరెళ్ల సమాఖ్య, కూరపాటి విజయలక్ష్మి, మోరె రూప, కనుకుంట్ల పార్వతి, కాపు కృష్ణ, ఎంఏ రజాక్, పిడుగు శ్రీను, కూరపాటి సుధాకర్, కనుకుంట్ల శ్రీనివాస్, మోరె రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 'పేట'కు అధిక నిధులు తెచ్చా..

- నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశా..
- బీఆర్ఎస్ పథకాలే రాష్ట్ర ప్రజలకు శ్రీరామరక్ష
- చండ్రుగొండ ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా


చండ్రుగొండ మండల ప్రచారంలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు

చండ్రుగొండ, నవంబర్ 24: అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ సహకారంతో అధిక నిధులు తెచ్చానని అశ్వారావుపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ అభివృద్ధి మరింతగా కొనసాగాలంటే బీఆర్ఎస్ విజయం సాధించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందుకోసం నియోజకవర్గ ప్రజలంతా ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి తనకు అత్యధిక మెజార్టీ అందించి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. చండ్రుగొండ మండలలో శుక్రవారం పర్యటించిన ఆయన.. రావికంపాడు, పోకలగూడెం, వెంకటియాతండా, మంగయ్యబంజర పంచాయతీల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత రావికంపాడు ముత్యాలమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేసి చశారు. ప్రచార రథంపై గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. అలాగే, పోకలగూడెం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బండి కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాడు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. అనంతరం గ్రామాల్లో జరిగిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని స్పష్టం చేశారు. అందువల్లనే మన రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే రాష్ట్ర ప్రజలకు శ్రీరామరక్ష అని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తాటి వెంకటేశ్వర్లు, వగ్గెల పూజ, బానోత్ పద్మావతి, భూక్యా ప్రసాద్, కొణకండ్ల వెంకటరెడ్డి, దార వెంకటేశ్వరరావు, రాఘవులు, రసూల్, రమేశ్, లింగయ్య, మోహన్‌రావు, శ్రీనివాస్‌నాయక్, రామారావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, చిన్న పిచ్చయ్య, నాగరాజు, శివ, జనార్దన్‌రావు, రన్య, సత్యనారాయణ, వెంకటనారాయణ, వెంకటేశ్వరరావు, బాబురావు, హనుమంతరావు, అంజన్‌రావు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.